క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



హన్యనాయక్‌ను పరామర్శిస్తున్న అంజయ్యయాదవ్, నాయకులు

షాద్‌నగర్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మాజీ సర్పంచ్ హన్యనాయక్‌ను పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నటరాజన్, నాయకులు గుండు అశోక్, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై జొన్న విత్తనాల పంపిణీ



రైతులకు జొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: రైతులకు 75 శాతం సబ్సిడీపై సీఎస్‌హెచ్–24 రకం జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు పశువైద్యాధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని రేగడిదోస్వాడ పశువైద్యశాలలో సీఎస్‌హెచ్–24 రకం జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని పశువైద్యశాలల్లో రైతులకు అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు.

చిన్నారులకు ఆటాపాటలతో బోధన



ఎల్లో డేలో విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటాపాటలతో విద్యాబుద్ధులు నేర్పించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ–2 టీచర్ కవిత అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ–2లో ఎల్లో డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎల్లో టోపీలు ధరించి, ఎల్లో బెలూన్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ మనోహర్



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని ఎంఈఓ మనోహర్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన పాత్లావత్ సంతోష్‌నాయక్ సహకారంతో విద్యార్థులకు ఐడీ కార్డులు, టై, బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుల్లో రాణించాలని సూచించారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమాన్యుయేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాటు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తూరు: మండలంలోని ఆయా చెరువుల్లోకి వరద నీటి ప్రవాహం వెళ్లేందుకు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని మత్స్యకార సంఘం నేత అంజయ్య శనివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. రియల్ వ్యాపారులు, ఆయా పరిశ్రమల నిర్వాహకులు సహజసిద్ధంగా ఏర్పడిన కాల్వలను ధ్వంసం చేయడం, కొన్నిచోట్ల దారి మళ్లించినట్లు తెలిపారు. దీంతో భారీ వర్షాలు కురిసిన చెరువుల్లోకి వరదనీరు రాని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ధ్వంసమైన పాటుకాల్వలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

అండర్‌పాస్.. వానొస్తే క్లోజ్

భారీగా నిల్వ ఉంటున్న వరద నీరు

- మోటార్లతో తొలగిస్తున్న కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులు

కొత్తూరు: ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతతో ఎంతో గజిబిజిగా ఉన్న కూడళ్లలో సైతం ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంజనీర్లు వంతెనలు, అండర్‌పాస్‌లను డిజైన్ చేస్తున్నారు. ఇంజనీర్లు ఇచ్చే సూచనలతో నిర్మించిన వంతెనలు, అండర్‌పాస్‌లు వాహనదారులకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతున్నాయి. కాగా ఇందుకు భిన్నంగా కొత్తూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వైజంక్షన్ కూడలి వద్ద నిర్మించిన అండర్‌పాస్ సాంకేతికతకు పూర్తి విరుద్ధంగా ఉంది. అండర్‌పాస్ కింద నుంచి రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షాకాలంలో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే వాహనాలు అండర్‌పాస్ కింద నుంచి వెళ్లకుండా కాంట్రాక్ట్ సంస్థ నిర్వాహకులు బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు నీళ్లలో నుంచి వెళ్లే క్రమంలో వాహనాలు నిలిచిపోయి మరమ్మతులకు గురవుతున్నాయి.

డిజైన్ లోపంతోనే..

పట్టణ సమీపంలోని వై జంక్షన్ కూడలి వద్ద చోటు చేసుకుంటున్న ప్రమాదాలను నియంత్రించడానికి వీలుగా గత ఆరేళ్ల క్రితం సుమారు రూ.16 కోట్లతో అండర్‌పాస్‌ను నిర్మించారు. నిర్మాణ సమయంలోనే డిజైన్‌లో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించిన స్థానికులు డిజైన్ మార్చడంతో పాటు త్వరగా పనులు పూర్తిచేయాలని పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. చివరగా పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ పాత డిజైన్ మేరకు గత రెండేళ్ల క్రితం పనులు పూర్తి చేయడంతో వాడుకలోకి వచ్చింది. కాగా కొత్తూరు నుంచి అండర్‌పాస్ గుండా పెంజర్లకు వెళ్లే వాహనాలు, పెంజర్ల నుంచి కొత్తూరులోకి వచ్చే వాహనదారులు గజిబిజి డిజైన్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు వరదనీరు వెళ్లేందుకు సరైన ఏర్పాట్లు లేని కారణంగా భారీ వర్షాలు కురిస్తే సుమారు పన్నెండు ఫీట్ల మేర నీరు నిలుస్తున్నాయి. స్థానికులు, పోలీసుల సూచనతో కాంట్రాక్ట్ సంస్థ అండర్‌పాస్ కిందకి వచ్చే వరద నీటిని తోడేందుకు ఓ సంపు, మోటార్లు ఏర్పాటు చేశారు. కాగా వర్షాలు పడే సమయంలో కరెంట్ లేకపోవడంతో మోటార్లు నడవక వరద నీరు నిలుస్తున్నాయి. అంతేకాకుండా వరద నీటి ప్రవాహానికి మట్టి, కాగితాలు సంపులోకి చేరుకొని మోటార్లు పనిచేయడం లేదు. అతికష్టం మీద కాంట్రాక్ట్ సంస్థ నిర్వాకులు వర్షాలు తగ్గిన తర్వాత మోటార్లకు మరమ్మతులు చేయించి నీటిని తోడే వరకు అండర్‌పాస్‌ను మూసివేస్తున్నారు.



రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి అండర్‌పాస్ కింద నీటిలో చిక్కుకున్న వ్యాన్

అండర్‌పాస్ కింద చోటు చేసుకుంటున్న ప్రమాదాలు..

- గతేడాది కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి తన కారులో అండర్‌పాస్ దాటే క్రమంలో నీటి ఉధృతికి కారు నిలిచిపోయింది. వెంటనే అతను కారులో నుంచి బయటకు దిగి ప్రాణాలు దక్కించుకున్నాడు.
- కొత్తూరు పట్టణం, షాద్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అండర్‌పాస్ నుంచి వెళ్లే క్రమంలో వారి కార్లు నీటిలో ఇరుక్కుపోయాయి.
- వస్తువులు, కూరగాయాలను తరలించే షాద్‌నగర్‌కు చెందిన ఓ ఆటోడ్రైవర్ అండర్‌పాస్ కింద నిలిచిన వరద నీటిని అంచనా వేయకుండా రావడంతో ఆటో బోల్తాపడింది.
- వర్షాలు కురిసిన వెంటనే అండర్‌పాస్ కిందకు రాకపోకలను నియంత్రించకపోవడంతో నీటిని అంచనా వేయలేని ద్విచక్ర వాహనదారులు అందులో నుంచి ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



పట్టణంలోని వై జంక్షన్ కూడలి సమీపంలో నిర్మించిన అండర్‌పాస్ వంతెన కింద ప్రయాణం, వాహనాల రాకపోకలు గజిబిజిగా ఉంది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు అండర్‌పాస్‌ను పరిశీలించి ప్రమాదాల నివారకు చర్యలు తీసుకోవాలి.

– ఎర్రోళ్ల జగన్, పెంజర్ల

నీరు నిల్వకుండా చూడాలి



అండర్‌పాస్ వంతెన డిజైన్‌లోనే లోపాలు ఉన్నాయి. అండర్‌పాస్ కింద వర్షాకాలంలో వరద నీరు ఎక్కువగా ఉంటే వాహనదారులు వెళ్లకుండా బోర్డులు పెట్టాలి. ముఖ్యంగా వరద నీరు ఎక్కువగా నిల్వకుండా చూడాలి.

– సుదర్శన్‌గౌడ్, కొత్తూరు



కేటీఆర్‌పై ఫిర్యాదు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

కేటీఆర్‌పై చర్యలకు ఫిర్యాదు

షాబాద్: ఖమ్మం జిల్లాలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేటీఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో సీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరుతో అప్పులు చేసిన రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన రీతిలో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింలుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలను కాపాడుకుందాం

తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: రైతులకు ఉపయోగపడుతున్న చెరువు, కుంటలను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ పరమేశ్వరచారి అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం సమీపంలో ఎర్రకుంటను అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఎర్రకుంటకు గండిపడి పూర్తిస్థాయి నీరు దిగువన ప్రవహించాయి. నీరు లేక వెలవెలబోయిన ఎర్రకుంటను అధికారులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుంటలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నప్పుడే చుట్టు పక్కన ఉన్న రైతుల బోరుబావులు సంపూర్ణ నీటిని అందిస్తాయన్నారు. ప్రభుత్వం ద్వారా చెరువులు, కుంటలు కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వెంటనే ఇరిగేషన్ ద్వారా చెరువుకు మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. ఎర్రకుంట ఎలాంటి కబ్జాకు గురైనా వారిపై చర్యలు తీసుకొని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి, నాయకులు నివాస్‌యాదవ్, తిరుపతిరెడ్డి, జీపీ సిబ్బంది నర్సింహ, జగన్ పాల్గొన్నారు.



ఎర్రకుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డీఈ పరమేశ్వరచారి



❖ అలుగుపారుతున్న మూలకుంట

మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ సమీపంలో గల మూలకుంటచెరువు శుక్రవారం కురిసిన వర్షానికి నిండుకుండలా జలకళ సంతరించుకుంది. ఈ రోడ్డుపై భారీగా నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

– మొయినాబాద్‌రూరల్

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆ సంఘం సభ్యులు సందర్శించి సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను తట్టుకోవాలంటే ప్రతి 6 నెలలకు ఒక డీఏను ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి.. 19 నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల సమ్మె కాలపు వేతనాలను విడుదల చేయాలని, వాటిల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మార్చాలని, విద్యార్థుల సంఖ్య మాత్రమే కాకుండా మీడియంను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనియెడల టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు కృష్ణయ్య, రంగరాజన్‌కుమార్, బాలయ్య, యాదయ్య, శివకుమార్, బుద్ధదేవ్, భరత్‌కుమార్, దత్తాత్రేయ, మహేష్, సమత, జ్యోతిర్మయి, కృష్ణవేణి, పరమేశ్వరి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా స్వామివారి పల్లకీసేవకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు శ్రీశైలంగౌడ్, వసంతరావు, అన్నారం రఘు, రమేశ్, క్యూసెట్ శ్రీనివాస్, నర్సింలు, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లింగమయ్య, శేఖర్‌గౌడ్, యాదగిరి అర్చకులు రఘుపతిరావు, రాఘవేందర్, కృష్ణ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌కు సన్మానం

చేవెళ్ల: బీజేపీ మతోన్మాద చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తూ వాటిని చట్టపరంగా ఎలా ఎదుర్కోవాలో ప్రణాళికలను సిద్ధం చేసుకుంటుందని టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ బి.యాదిరెడ్డి అన్నారు. చేవెళ్లలో శనివారం యాదిరెడ్డిని సీనియర్ నాయకులు, న్యాయవాదులు రాజా, జగన్ మోహన్‌రెడ్డి, రఘునందన్ కలిశారు. ఈ సందర్భంగా వారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు లీగల్ నోటీసులు పంపటాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్యం నిబద్ధతల పట్ల తమ కట్టుబాటును గుర్తుచేశారు. ఈ సందర్భంగా వారు లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా ఎంపికైన బి.యాదిరెడ్డిని సన్మానించారు. పార్టీ లీగల్ వ్యవస్థను బలోపేతం చేయటంలో కీలకంగా వ్యవహరిస్తామన్నారు. లీగల్ కమిటీలను ఏర్పాటు చేసి లీగల్ సెల్‌ను బలోపేతం చేయనున్నట్లు స్పష్టం చేశారు.



యాదిరెడ్డిని సన్మానిస్తున్న సీనియర్ నాయకులు

ఘనంగా బోనాల ఉత్సవాలు



చేవెళ్ల: ఓ పాఠశాలలో విద్యార్థుల ఆటాపాటలు

చేవెళ్ల: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాసం బోనాల ఉత్సవాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా బోనాలు, పోతురాజుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు.



షాబాద్: బోనాల ఊరేగింపులో విద్యార్థులు

వివిధ వేషధారణల్లో..

షాబాద్: మండల పరిధిలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను పూలతో అలంకరించారు. బోనాల ఊరేగింపులో విభిన్న వేషధారణల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్



డివైడర్‌పై మొక్క నాటుతున్న కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. శనివారం హైదరాబాద్–బీజాపూర్ రహదారి డివైడర్లపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి చెట్లు పెంచినప్పుడే కాలుష్య నివారణకు కృషి చేసిన వారమవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

గాంధీయిజం ఇంటర్నేషనల్ స్పీకర్ గాంధీ దర్శన్

షాబాద్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని గాంధీయిజం ఇంటర్నేషనల్ స్పీకర్ గాంధీ దర్శన్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను గాంధీయిజం ఇంటర్నేషనల్ సెక్రటరీ ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లనపల్లి, సాథి ప్రాజెక్టుమినిస్ట్రీ ఆఫ్ ఇండియా కో–ఆర్డినేటర్, కాన్పూర్ ఐఐటీ ప్రొఫెసర్ ఇషాంత్ దూబే, పాఠశాల కరెస్పాండెంట్ సిద్ధపురం ప్రసాద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ దర్శన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంతో పాటు నైపుణ్యాభివృద్ధి బాటలో యువత ముందడుగు వేయాలన్నారు. ఆత్మ విశ్వాంతో పాటు మారుతున్న ఆధునికతను అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, ఉపాధ్యాయులు, సఫియా, సమంతనాయక్, మధు, ప్రవళిక, సునీత, అనురాధ, ప్రవీణ్, రాజేందర్, శిల్పా, తహోర, ప్రభావతి, మాధవి, సునంత, సంతోష, అపర్ణ, అనుణ, పావని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చేయూత

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో శనివారం సీడ్ ఫార్మ్ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కిశోర్ ఇంటర్మీడియేట్‌లో మంచి మార్కులు సాధించిన గ్రామానికి చెందిన చైతన్య, పాత్లావత్ ప్రియాంక, నేనావత్ ఉర్మిళకు రూ.10వేల చొప్పున, పదో తరగతిలో వలకొండ అఖిల్‌కు రూ.5వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పల్లె బాలీశ్వర్, శేఖర్‌రెడ్డి, శ్యాం, పాపయ్య, పల్లె అంజయ్య, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ ఎండీ కిశోర్